# ధ్రువోపాఖ్యానం

## వేదుల మీనాక్షిదేవి

"అమ్మా, అత్తయ్య వచ్చింది" అని కేక వేశాడు సావిట్లో చదువుకుంటున్న రఘు.

లోపలినుండి మా మరదలు, పిల్లలు బిలబిల్లాడుతూ వచ్చారు సావిట్లోకి.

"అత్తయ్యొచ్చిందోయ్, మా అత్తయ్యొచ్చిందోయ్" అంటూ గంతులేసుకుంటూ చిన్న పిల్లలిద్దరూ నాకాళ్లు చుట్టేశారు. పెద్ద పిల్ల శశి సామాను లోపల పెట్టించి, పంపేసింది రిక్షావాణ్ణి.

చిన్న పిల్లవాడు శ్రీను ఆరేళ్లవాడు. ఆఖరి పిల్ల పూర్ణ నాలుగేళ్లది.

నలుగురు పిల్లలూ చుట్టూచేరి వూపిరిసలపనియ్యకుండా తలోమాటా ఆడుతున్నారు. ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. చిన్న పిల్లలిద్దరూ గట్టిగా వాటేసుకుని కదలనియ్యడం లేదు నన్ను.

పిల్లలకోడిలాగవున్న నన్ను చూసి మా మరదలు నవ్వుకుంది.

"లోపలికి రానియ్యండి అత్తయ్యను. కాళ్లు కడుక్కోనివ్వండి" అంది పిల్లల్ని.

"ఆ మర్యాదలతో వాళ్లకేం పని? నేను వచ్చానని బ్రహ్మానంద పడిపోతున్నారు. పాపం వాళ్లు. రెండేళ్లయిందివీళ్లనిచూసి. కళ్లు కాయలు కాసినట్లయిపోయాయి వీళ్లని చూడ్డానికి ఇప్పటికిగాని తెరిపి అవలేదు రావడానికి" అంటూ వాళ్లని తీసుకుని లోపలికి వెళ్లాను.

పెట్టెతీసి పెద్ద పిల్లవాడికి, పెద్ద పిల్లకు కథల పుస్తకాలు రెండు పెద్ద బొమ్మలు యిచ్చాను. శ్రీనుకి లాగు, చొక్కా, ఒక రైలు యిచ్చాను. పూర్ణకి పువ్వులగౌను, ఒక విమానం యిచ్చాను. వాళ్ల వాళ్ల వస్తువులు తీసుకుని నలుగురు పిల్లలూ వెళ్లిపోయారు. అప్పటికిగాని మరదలు, నేను యోగక్షేమాలు మాట్లాడుకోటం కాలేదు. తమ్ముడు రావు ఆఫీసుకి వెళ్లాడు. సాయంత్రం గాని రాడు.

ఒక్క అరగంట అయింది. నేను, మరదలు భోజనంచేసి, తాంబూలం వేసుకుంటూ కూర్చున్నాం.

ఏడుస్తూ వచ్చింది పూర్ణ.

"ఏం?" అన్నాను ఒళ్లో కూర్చోపెట్టుకుని.

"శ్రీను రైలు యివ్వనన్నాడు. నేను గిల్లుతూంటూంటే వాడు కొట్టాడు." అంది.

తను చేసిన తప్పుపని చెప్పకూడదని తెలియని అమాయకత్వం కదా. వాడు కొట్టాడనకుండా తను గిల్లినట్లు, దానికి బదులు కొట్టినట్లు తనే చెప్పేసింది పాపం.

"అయితే నీకు విమానం యిచ్చానుకదా? వాడి రైలెందుకు నీకు?" అన్నాను.

"ఆ విమానం నాకు వద్దు" అంది ఖండితంగా.

"మరి వాడి రైలు వాడెందుకిస్తాడు?" అని ప్రశ్నించాను.

"నా విమానం యిస్తా. నీ రైలు యియ్యమన్నాగా" అంది.

"వాడివ్వనంటే గిల్లుతావా? తప్పుకదమ్మా" అన్నాను.

"రైలు యివ్వకపోతే గిల్లనా మరి?" అని యెదురుప్రశ్న వేసింది పూర్ణ. అది గిల్లడం యింతమాత్రం తప్పుకానట్లు, పైగా చాలా అవసరమయే గిల్లినట్లు దాని నమ్మకం.

ఏమీ యెరగనట్లు వచ్చి శ్రీను పొరుగింటి ముత్తైదువలాగ గుమ్మందగ్గిర నిలబడి, బుగ్గను చెయ్యిపెట్టుకుని చూస్తున్నాడు.

"ఏంరా? అది గిల్లితే మాత్రం చిన్నది కదా. నువ్వు పెద్దవాడివి కొట్టవచ్చునా?" అంది వాళ్లమ్మ.

"అత్తయ్య దానికి విమానం, నాకు రైలు యిచ్చింది కదా. మరి నా రైలు అది అడగడము తప్పుకాదా? అడగడం కాకుండా ఇవ్వనంటే గిల్లింది. నేను కొట్టాను. చెల్లుకి చెల్లు అయిపోయింది. నేను అన్నయ్యంత పెద్దవాడినా?" అన్నాడు శ్రీను.

"అత్తయ్య యిచ్చినవస్తులనుగురించి దెబ్బలాడుకుంటే ఆవిడ యేమనుకుంటారు? దెబ్బలాడుకుంటే యింకెప్పుడూ యేవీ తేవద్దని చెబుతాను ఆవిడతో" అంది వాళ్ల అమ్మ.

"చూడు అత్తా. మరేమో అమ్మ యెప్పుడూ పూర్ణనే వెనకేసుకొస్తుంది. నన్ను తిడుతుంది. అది యేది యిమ్మంటే అది యిచ్చేసి దణ్ణంపెట్టెయ్యాలిట. నువ్విచ్చిన రైలు యెంతో ముద్దొస్తోంది. నేనెందుకిస్తాను" అనివాళ్లమ్మమీద నేరం చెప్పి రైలు యివ్వనని ఖండితంగా చెప్పాడు యేడుస్తూనే.

వాడిని దగ్గరకు తీసుకొన్నాను. వాడి ఏడుపు మరోస్థాయి హెచ్చింది. నేను ఓదారుస్తున్నాను. ఇంతలో నా ఒళ్లో కూర్చున్న పూర్ణ గభీమని లేచి చక్కాపోయింది వాళ్లమ్మ దగ్గరకి.


"అదేమే అలా వెళ్లిపోయావు?" అన్నాను ఆశ్చర్యపడి.

"వాడు కూర్చున్నాడుగా, నేనెందుకు?" అంది పూర్ణ.

మామరదలకేసి ప్రశ్నార్థకంగా చూశాను ఏమిటన్నట్లు.

"అసలువచ్చిన గొడవే అదండీ. ఇద్దరికీ పడదు. వాడున్నచోట అదివుండదు. అది వున్నచోట వాడువుండడు. ఒకరు నడిచిన త్రోవను రెండోవారు నడవరు. ఎంతమంచి వస్తువులైనా సరే వాళ్లది వాళ్లకు నచ్చదు. ఎదటివాళ్ల వస్తువుకోసం పేచీ. ఒకనాడు గడ్డిపోచకోసం పేచీ పడ్డారు. అప్పుడు నేను మరోగడ్డిపోచ అలాంటిదే తెచ్చియిస్తే పొడుగనీ, వెడల్పనీ పేచీ పెట్టి యెలాగో సమాధానపడ్డం బ్రహ్మాండమైంది" అంది మరదలు.

"అయ్యో యింత పేచీ పెడతారని తెలిస్తే



ఒకరకమే యిద్దరికీ తెద్దును. తగాదా కొని తెచ్చినట్లయింది సొమ్ము పెట్టి" అన్నాను.

"సాయంత్రం రైలు తెప్పిస్తాను బజారు నుండి" అని పిల్లని సమాధాన పరచి పంపాను.

"అయితే యీ రైలు నాకు వద్దే వద్దు" అన్నాడు శ్రీను.

"ఎందుచేత?" అన్నాను.

"దానికి విమానం, రైలు రెండు అవుతాయి" అన్నాడు.

"మరైతే నీకు విమానం కూడా తెప్పిస్తాను. నీకూ రెండు అవుతాయి అప్పుడు. సరేనా?" అన్నాను.

"అచ్చా, అచ్చా. నాకు రెండోయ్" అంటూ ఆడుకుందుకు చక్కాపోయాడు శ్రీను.

"మీరు యెన్ని తెప్పించినా సరే వాళ్ళ పేచీ తప్పదు. రెండు రైళ్లు ఒక్కలాగ వుండాలి. రెండు విమానాలు ఒక్కలాగ వుండాలి. ఏ కాస్త తేడా లేకుండా ఒక్కలాగ దొరకడం కుదరదుకదా. ఇప్పుడు దీని కొసమే కాదు. ఎందుకో అందుకు పేచీ లేనిదే వాళ్లకి పొద్దుపోదు" అంది మరదలు.

"నేనెలాగో సముదాయిస్తాను నేనున్న నాలుగు రోజులు" అన్నాను.

* * *

దీపాలవేళకి మాతమ్ముడు రావువచ్చాడు. "అక్కయ్య యెప్పుడు వచ్చింది" అంటూ కాళ్ళు కడుక్కువచ్చి చిన్న పిల్లాడులాగ దగ్గిర కూర్చున్నాడు.

చిన్నపిల్లలిద్దరు కన్ను అన్నం కలిపిపెట్టమన్నారు. అంటే యిద్దరూ కలిసి కాదు. వేర వేరనే అడిగారు. ఇద్దరికీ వేరుగా కలపడం యెలాగ అని ఒక్క కంచంలో నే కలిపి పెడతానన్నాను.

"పులినీ మేకనీ ఓ కంచంలో పాలు త్రాగించినట్లు" అన్నాడు తమ్ముడు నవ్వుతూ.

కొత్తగా వచ్చాను గనుక ఒక కంచంలో కలపడానికి అంగీకరించినా, రెండు షరతులు ప్రతిపాదించి మరీ అంగీకరించారు. ఒకటి. ఎవ్వరూ కంచం ముట్టుకోనకూడదు నేను తప్ప. (పూర్ణ అని శ్రీను వుూహ. శ్రీను అని పూర్ణ అభిప్రాయం) రెండు. వరసగా యిద్దరినీ కూర్చొపెట్టక పోవడం ఈ రెండింటికీ అంగీకరించాను. నాకు చెరొక ప్రక్క చెరొకరినీ కూర్చొపెట్టుకుని నే నే కలిపి వాళ్ల చేతులలో పెట్టడం అన్నమాట.

భోజన మధ్యంలో "అత్తయ్యోయ్ నా కొత్తప్లేట" అన్నాడు శ్రీను.

"నా కొత్త గ్లాసు యిదిగో" అంది నోటి నిండా అన్నంతో పూర్ణ.

"రైలు, విమానంలాగ పేచీ లేకుండా ఒక ప్లేటతోను, ఒక గ్లాసుతో ను తృప్తిపడ్డట్టున్నారే" అన్నాను ఆశ్చర్యపోతూ.

"దీనికే పేచీపెట్టాం. కాని, మా నాన్న చీటీలు వేశాడు" అన్నాడు శ్రీను.

"చీటిలేమిటికి?" అన్నాను.

"మా నాన్న రెండు కాగితం ముక్కలు తెచ్చి ప్లేటబొమ్మ ఓ కాగితం ముక్కమీద గ్లాసు బొమ్మ ఓ కాగితంముక్కమీద వేశాడు. రెండూ గిలకరించి క్రిందపడేశాడు. కళ్లు మూసుకుని మేం తీసుకున్నాం. ఎవరికే బొమ్మవస్తే ఆ వస్తువు వాళ్లది అన్నాడు నాన్న. నాకు ప్లేటబొమ్మ, పూర్ణకి గ్లాసు బొమ్మ వచ్చింది. అప్పటినించి ప్లేట నేను, గ్లాసు అదివాడుకుంటున్నాం. దానికి చదువు రాదుకదూ. అందుకని బొమ్మవేశాడు నాన్న" అని కళ్ళు తిప్పుకుంటూ చెప్పాడు శ్రీను. పైగా దానికి చదువురాదని చెప్పడంలో తను విద్యావంతుడైనట్లు చెప్పుకోవడం మరొక విశేషం. వీడీమధ్య అక్షరాభ్యాసమై ఒకటవ తరగతి పుస్తకం చదువుతున్నాడు పైవేటు మేష్టరు దగ్గిర. అది చెప్పడం కోసం యీ తిప్పలన్నీను.

"భలే బాగుంది వుపాయం. రైలు, విమానం కూడా అలాచేద్దాం. మళ్ళీ అలాంటివే తెప్పించడం యెందుకు? మరోమాటు మీ యిద్దరికీ ఒక్కలాంటివే బొమ్మలు తెస్తాను" అన్నాను.

శ్రీను, పూర్ణా సంపూర్ణంగీకారం తెలియజేశారు. చీట్లు వేశాం. శ్రీనుకివిమానం, పూర్ణకి రైలు వచ్చింది. శ్రీను ముఖం చిట్లించుకున్నాడు.

# ★ ధ్రువోపాఖ్యానం ★

"అత్తయ్య కొత్తగా వచ్చింది కదూ. అందుచేత" అని సరిపెట్టుకున్నాడు ఏమీ అనకుండా.

* * *

రాత్రి పూర్ణ తల్లిదగ్గిర, శ్రీను తండ్రిదగ్గిర పడుకుంటారు. పొరపాటునసైనా శ్రీను తల్లి దగ్గిరికి రాకూడదు. పూర్ణతండ్రి దగ్గిరికి పోకూడదు. అవిధంగా జరిగిందో రామ రావణ సంగ్రామం, వాలి, సుగ్రీవ యుద్ధం.

నేను వచ్చింది మొదలు పూర్ణ నాదగ్గిర పడుకుంటానని ఒకటే గొడవ, తను పడుకుంటానని శ్రీను పేచీ, "కథ చెప్పేశాక పూర్ణ అమ్మ దగ్గిరకి వెళ్ళిపోతుందిలే" అని వాడిని సమాధానపరచి యిద్దరినీ చెరొక వైపున పడుకోపెట్టుకున్నాను.

పులి, మేక, గడ్డిమేటి కథ చెప్పాను. ఇద్దరూ నిద్రపోకుండా విన్నారు.

ఉన్నట్లుండి శ్రీను నన్ను గట్టిగా గిల్లాడు. "అదేమిరా అలా గిల్లావు. నొప్పెట్టింది" అన్నాను.

పాపం వాడు చాలా నొచ్చుకున్నాడు. అయ్యో నిన్ను గిల్లానా అత్తా. పూర్ణ అనుకున్నాను." అన్నాడు.

"పూర్ణ అయితేమాత్రం నొప్పెట్టదూ అంతగట్టిగా గిల్లావుకదా, పాపం చిన్న పిల్ల అది. ఏమ్చేసిందికి కథ వింటోంది బుద్ధిగా నీలాగే" అన్నాను. నీలాగే అన్నాను గనుక సరిపోయిందిగాని లేకపోతే అది బుద్ధిగా వింటోందంటే యింకైనా పేచీ వచ్చేదే.

"సరేగాని కథ బోధపడిందా?" అన్నాను విషయం మారుస్తూ.

పూర్ణకి బాగా తెలిసినట్లు లేదు. వూరుకుంది.

"ఓ. నాకు తెలిసిపోయింది. పులి, మేకనీ ఓచోట పెడితే పులి మేకని తినేస్తుంది. మేకని, గడ్డిమేటినీ ఓచోట పెడితే మేక గడ్డి తినేస్తుంది. అందుచేత కాపువాడు పులినీ, గడ్డినీ అవతలగట్టున దింపి మళ్లీ యివతలగట్టుకివచ్చి మేకని తీసుకువెళ్ళాడు." అన్నాడు శ్రీను.

"కాపువాడు బలేవాడు" అంటూ కాపువాడిని మెచ్చుకున్నాడు.

"పులి, మేకతో కాపువాడు తిప్పలు పడవలసి వచ్చింది. మీ రిద్దరూ అస్తమానం కొట్టుకుంటూంటే మీ అమ్మా నాన్న మీ తగూలు తీర్చలేక బాధపడుతున్నారు. మీరిద్దరూ ఒక చోట చేరకుండా చూసుకోవలసి వస్తోంది. మీరు స్నేహంగా వుండరావా?" అన్నాను.

శ్రీనుకి ధ్రువకోపం వచ్చి లేచాడు.

"నేను పులినా?" అన్నాడు.

నువ్వు పులివి కాదు" అన్నాను.

"మరి నేనా"? అంది పూర్ణ బుంగ మూతిపెట్టి.

"నువ్వూ కాదమ్మా" అన్నాను.

ఇద్దరూ దెబ్బలాడుకోకుండా వుంటే మీకు రోజుకి చెరొక రెండు అణాలు యిస్తాను. పావిట్లో కాగితం ముక్కలు పొయ్యకండి. పోస్తే వెంటనే తీసిపారెయ్యండి. మీ నాన్నకోసం, యెవరైనా వస్తూంటారు. బాగా వుండదు" అన్నాను.

"సరే" అన్నారు. ఇద్దరూ నాదగ్గిరే నిద్రపోయారు.

* * *

తెల వారింది. కాఫీలయాయి. ఇద్దరూ వచ్చి నా ఎదురుగా నిలబడి "బుద్ధిగా వున్నామా?" అన్నారు.

"ఓ" అన్నాను నవ్వుతూ.

భోజనాల వేళలోపుగా నాలుగుమార్లు వచ్చి అడిగారు "బుద్ధిగా వున్నామా" అని.

"ఉన్నారు. ఇలాగే వుండాలి యెప్పుడూ పావిట్లో కాగితంముక్కలున్నాయి నేల మీద తీసిపారేయండి" అన్నాను.

(56-వ పేజీ చూడండి)



"ఇవిగో వినండు"—ప్రతిశుక్రవారము రేడియో సిలోన్ 41.72 మీటర్లమీద సాయంత్రం 6-30 నుండి 6-45 వరకు విని ఆనందించండి.

# ★ ధ్రువోపాఖ్యానం ★

(౭-వ పేజీ తరువాయి)

"పూర్ణ పోసిందేమోగాని నేను పొయ్యలేదన్నాడు" శ్రీను.

"నేను పొయ్యలేదు. అదే పడిపోయిందేమో" అంది పూర్ణ.

"ఎవరు పోస్తేనేం. ఇల్లు శుభ్రం అంతా చెయ్యాలి" అన్నాను.

"అయితే నీ డబ్బులు వద్దే వద్దు" అన్నాడు శ్రీను.

"వాడంతే అత్తా" అంది పూర్ణ. అన్నగారిని గురించి తన అభిప్రాయం వెలిబుచ్చింది.

"నన్ననడానికి నువ్వెవరే?" అంటూ ఒక్క లెంపకాయ వేశాడు.

దానికన్న పెద్దవాడు గనుక అన్నగారు శిక్షించాడు దాన్ని!

అది మాత్రం తీసిపోయిందా! లక్కపిడత గిరవాటు వేసింది.

నేను "వద్దు వద్దు" అంటూనే వున్నాను. ఒక్కళ్ళూ వినిపించుకోలేదు.

ఇద్దరి యేడుపులూ విని రావు వ్రాసుకుంటున్నవాడు గబగబ వచ్చాడు. ఏడుస్తున్న వాళ్ళనీ, ఏమీ చెయ్యలేక చూస్తున్న నన్నూ చూశాడు. జరిగిన సంగతి చెప్పాను.

"అక్కా ఈ విధమైన తగాదాలు సర్వసాధారణమై పోయాయి మాకు. ఇద్దరిలో యెవరైనా ఆడుకుందుకు వెళ్ళినప్పుడు యిల్లు ప్రశాంతంగా వుంటుంది. గజకచ్ఛపాలలాగ కొట్టుకుపోతూంటారు. ఏ పూర్వజన్మ శత్రుత్వమో వుంది వీళ్ళిద్దరికీను. పెద్ద పిల్లలిలా దెబ్బలాడుకోరెప్పుడూ.

శ్రీను వున్నాడే వీడు పిల్లమీదికి ఒంటికాలిమీద లేస్తాడు. ఎప్పుడూ దాని చెయ్యో, కాలో, వేలో తొక్కుతాడు. అది "మొర్రో" మంటే "చూడలేదు" అంటాడు. ఆ చూడకపోవడంలో మరెవరినీ తొక్కడు. వాడు ఏది గిరవాటువేసినా దానికే తగులుతుంది. మరెవరికీ తగలదు. ఏదైనా తినే వస్తువుందనుకో. అందరికీ పెడతాడు దానికి తప్ప. "ఏమి" అంటే "మరిచిపోయాను. పొరబాటు" అంటాడు. అది కళ్ళబడితే ఎక్కిరించడమో, తిట్టడమో చేస్తేగాని వూరుకోడు.

ఇక పూర్ణవుందా. ఇంట్లో యెన్ని కాగితాలు వున్నా వాడి పుస్తకమే తీస్తుంది. వాడి పలక, పలకపుల్ల పట్టుకు తిరుగుతుంది. వాడిమీద కోపం వచ్చినప్పుడు పలక నేలకేసి పగలకొడుతుంది. అది వాడికి శిక్ష అని దాని వూహ. ఆ శిక్ష నాకు. మళ్ళీ వెంటనే కొనకపోతే వీలులేదన్న సంగతి దానికి తెలియదు. వాడి ఒకటవ తరగతి వాచకంతీసి "పూరణ" అని గుడ్డిగవ్వకాయలంత అక్షరాలతో వ్రాస్తుంది. దాని పేరు వ్రాయడం పెద్దపిల్లలు నేర్పారు. "పూర్ణ" అని వ్రాయడానికి "ణ" "ర" ప్రక్కని వ్రాస్తుంది. వాడు గోల్లుమని గోల. వాడి ఆటవస్తువులు పాడు చేస్తుంది. వాడు "వద్దు" అన్నపని చెయ్యడమే దానిపని. ఏమన్నా వాడు అంటే ఊరంత గొంతుకపెట్టుకుని అరుస్తుంది. వాళ్ళ అమ్మతో చెబుతుంది' ఫీజులేని ఆ ప్లీడరుగారు (మా మరదలు) వచ్చి పిల్లతరఫున వాదించుతుంది. నేను వాడితరఫు. అంటే ఇద్దరం రంగంలోకి దిగడమన్నమాటేగా! వీళ్ళతగాదాలతో మాకు పేచీలు వస్తున్నాయి" అని ఒక పెద్ద లెక్చరిచ్చేశాడు నిలుచున్నవాడు నిలుచున్నట్టే.

"ఈ వరసచూసే మీతమ్ముడు వీళ్ళకి కొత్తగా పేర్లుపెట్టారు. అడగండి కావలిస్తే" అంది మరదలు.

"ఏమిపేర్లు పెట్టావు?" అన్నాను రావుని.

"శ్రీనుకి ఉత్తరధ్రువం అనీ, పూర్ణకి దక్షిణధ్రువం అనీ పెట్టాను. ప్రాణం విసికిపోతోంది. ఉత్తరధ్రువం, దక్షిణధ్రువం ఎలాగ కలవకుండా వున్నాయో వీళ్ళలా వున్నారు. ఆ రెండు ధ్రువాలు దగ్గరకి రావు. వీళ్ళిద్దరికీ సఖ్యతరాదు" అన్నాడు రావు.

చిన్నపిల్లలిద్దరూ వాళ్ళ అమ్మ, నాన్న వాళ్ళమీద నేరాలు వరసపెట్టి చెబుతుంటే ఏమీ చెయ్యలేక బిక్కమొహాలు వేసుకుని చూస్తున్నారు.

వాళ్ళనిచూస్తే జాలివేసింది నాకు.

"ఎందుకల్లాగ వాళ్ళని అల్లరిపెడతారు. జంటకవుల్లాగ ఒకరితరువాత ఒకరుగా చెబుతున్నారు మీరిద్దరూను. చిన్నప్పుడిలా కొట్టుకున్నవాళ్ళే పెద్దయాక యెంతో ప్రేమగావుంటారు. మీరలాగ నేరం చెబుతూంటే వాళ్ళేమిచెయ్యగలరు మిమ్మల్ని" అన్నాను.

పిల్లలిద్దరినీ చెరోచేత్తోను నిమురుతూ "నాతో యెవరొస్తారో చెప్పండి. మీరూ సుఖంగా వుండవచ్చు. మీ నాన్న, అమ్మ సుఖంగా వుంటారు గొడవలులేకుండా. ఎంచక్క తాయిలాలు చేసిపెడతాను. సర్కసుకి, సినిమాలకీ తీసుకువెడతాను. మంచి మంచి బొమ్మలు కొనిపెడతాను" అన్నాను.

నేనలాగ అనగానే వాళ్ళు ఒకళ్ళ మొహం ఒకళ్ళు చూసుకున్నారు.

"నీతో రావాలనేవుంది అత్తా. కాని, అమ్మకూడా కావాలి" అంది పూర్ణ.

"మా నాన్నని విడిచి నేను వుండలేను. నువ్విక్కడే వుండు" అన్నాడు శ్రీను.

ఇద్దరు చెప్పినవాటి సారాంశం ఒక్కటే. "రాము" అనే!

నాకు తెలుసు వాళ్ళు రావడానికి అంగీకరించరని. ఎన్నడు తల్లితండ్రులను విడిచి యింతవరకు యెక్కడికీ వెళ్ళలేదు పాపం వాళ్ళు. కాని, నా తమ్ముడు, మరదలు అనుకోలేదు. సరదాపడి ఒకరు నాతో వస్తారనుకున్నారు. వీళ్ళ సమాధానం వాళ్ళని ఆశ్చర్యపరచింది.

వాళ్ళ మనస్సులలో యే భావాలుంటాయో గానీ తెలుసుకోవడం శక్యంకాదు. తల్లిదండ్రు లిద్దరూ పిల్లలిద్దరినీ కౌగలించుకుని చెంపలమీద ముద్దులవర్షం కురిపించేశారు.

నేరంచేసినవాళ్ళూ, నేరంచెప్పినవాళ్ళూ "మమైకం" అయేసరికి ఆ దృశ్యం చూసి నా కళ్ళు ఆనందంతో ఆర్ద్రాలయాయి. ★


పంపు సెట్ల నిర్మాణంలో
విప్లవాన్ని సృష్టించిన

**జ్యోతి 'యూనిబిల్ట్'**

తక్కువ పవరుతో ఎక్కువ నీటిని అనాయాసంగా ఇస్తుంది. ఉదాహరణకు: 5 హా. ప. 4" సెట్టు 26000 గ్యాలన్లూ, 3 హా. ప. 3" సెట్టు 16000 గ్యాలన్లూ 2 హా. ప. 2½" సెట్టు 11000 గ్యాలన్లూ గంటకు ఇస్తాయి.

MEI స్టార్టర్లతో రడీ స్టాకు నుండి సప్లయి చేయగలము.

**తాతా — ప్రభాత**
గోపువారి సత్రం వీధి,
గవర్నరుపేట - విజయవాడ 2.



**దాంపత్య రహస్యములు**

అను కొక్కోకము పటములతో 284 పుట[illegible] గలది. రూ. 2·00 కామకళారంగము [illegible] కొక్కోకము పటములతో రూ. 1·25 [illegible] కళా లేక కొక్కోకము పటములతో రూ. 1·[illegible] పోస్టేజీ వేరు. D. S. మిత్రా & కో, 26 [illegible] (BEAT) సాకారుపేట, మద్రాసు-1



Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad